క్లుప్తంగా

మర్యాదపూర్వక కలయిక



భెల్ సీఎస్‌వోతో గుర్తింపు యూనియన్ నాయకులు

గాజువాక: భెల్ చీఫ్ సెక్యూరిటీ ఆఫీసర్‌గా బాధ్యతలు స్వీకరించిన డాక్టర్ కె.సునీల్ కుమార్‌ను ఆ సంస్థ గుర్తింపు యూనియన్, యునైటెడ్ ఫ్రంట్ నాయకులు సోమవారం మర్యాపూర్వకంగా కలిశారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఆయన్ను అభినందించిన అనంతరం బీహెచ్‌ఈఎల్, హెచ్‌పీ వీపీ యూనిట్‌కు సంబంధించిన పలు భద్రతాపరమైన అంశాలపై చర్చించారు. సీఎస్‌వోను కలిసినవారిలో నాయకులు బొండా బాబూరావు, సుభాకర్ సాహు, పి.వి.ఎస్.రాజు, కొల్లి దేముడు తదితరులున్నారు.

దివ్యాంగ బాలుడికి వీల్ చైర్ అందజేత



గౌతమ్‌సాయికి వీల్ అందజేస్తున్న ట్రస్ట్ ప్రతినిధులు

పెదగంట్యాడ: వాంబేకాలనీకి చెందిన గౌతమ్ సాయి అనే దివ్యాంగ బాలుడికి విప్లవ చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షుడు వినోద్‌బాలు, టీడీఎస్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు ఢిల్లీశ్వరరావు సంయుక్తంగా సోమవారం వీల్ చైర్ అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆపదలో ఉన్నవారికి ఆపన్న హస్తం అందించడమే లక్ష్యమని, ప్రతి ఒక్కరూ సమాజసేవలో భాగస్వామ్యం కావాలన్నారు. కార్యక్రమంలో జి. విష్ణు, కార్తీక్, సత్యం, చందు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పెన్నులు, పుస్తకాల పంపిణీ



పుస్తకాలు, పెన్నులు అందజేస్తున్న సత్యసాయి ప్రతినిధులు

ఉక్కునగరం: సత్యసాయి విశాఖ జిల్లా మహిళా యువజన విభాగం ఆధ్వర్యంలో సోమవారం విద్యార్థులకు పలు వస్తువులు పంపిణీ చేశారు. సత్యసాయి శత జయంతి ఉత్సవాల్లో భాగంగా కణితి జెడ్పీ హైస్కూల్‌లో 89 మంది విద్యార్థులకు 250 నోట్ పుస్తకాలు, 100 పెన్సిళ్లు, 100 స్కేళ్లు, 30 జామెట్రీ బాక్సులు అందజేశారు. జిల్లా మహిళా యువజన కో–ఆర్డినేటర్ సోమేశ్వరి నేతృత్వంలో జరిగిన కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు ప్రకాష్, ఉపాధ్యాయులు, సత్యసాయి యువజన కో–ఆర్డినేటర్లు, సేవా కార్యకర్తలు పాల్గొన్నారు.

ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ గోపీకృష్ణ బాధ్యతల స్వీకరణ



అగనంపూడి: అగనంపూడి ప్రాంతీయ వైద్యాలయం సూపరింటెండెంట్‌గా డాక్టర్ పి.గోపీకృష్ణ సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేసిన డాక్టర్ జె.భారతి గత నెలలో ఉద్యోగ విరమణ పొందారు. తర్వాత బాధ్యతలు చేపట్టిన డాక్టర్ పి.ఉషా శ్రీకాకుళం జిల్లా నరసన్నపేట సీహెచ్‌సీ సూపరింటెండెంట్‌గా బదిలీపై వెళ్లడంతో డాక్టర్ గోపీకృష్ణకు ఫుల్ అడిషనల్ చార్జ్ సూపరింటెండెంట్‌గా నియమించడంతో ఆయన బాధ్యతలు చేపట్టారు. ఆయన మాట్లాడుతూ వైద్యులు, సిబ్బందితో సమన్వయంతో పనిచేసి రోగులకు మెరుగైన సేవలు అందిస్తామన్నారు.

రథం షెల్టర్ నిర్మాణ పనుల పరిశీలన

అగనంపూడి: ఎండకు ఎండి వానకు తడుస్తున్న అగనంపూడి జగన్నాథస్వామి రథం కోసం నిర్మిస్తున్న షెల్టర్ పనులను 79వ వార్డు కార్పొరేటర్ రౌతు శ్రీనివాసరావు పరిశీలించారు. అగనంపూడి కూడలిలో జాతీయ రహదారిని ఆనుకొని రథోత్సవం కోసం కేటాయించిన స్థలంలో రథాన్ని నిలుపుతున్నారు. అయితే గతంలో ఉన్న పాకను తొలగించి పక్కా నిర్మాణం చేపట్టేందుకు జీవీఎంసీ నిధులు విడుదల చేసింది. అయితే నిర్మాణ పనులు నెమ్మదించడంతో కార్పొరేటర్ స్పందించి తక్షణం పనులు పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. కార్యక్రమంలో గళ్ల రాజు, కరణం సత్యారావు, జగదీష్, మాడిశ వెంకటరావు, మామిడి అప్పారావు పాల్గొన్నారు.

ఏ బిడ్డా.. ఇది మా అడ్డా!



చిన నడుపూరు నూకాంబిక ఆలయం పక్కన సర్వీస్ రోడ్డులో నిలిపిన వాహనాలు

- రోడ్లపై అనధికార పార్కింగ్
- నిత్యం ట్రాఫిక్ సమస్యలు, ప్రమాదాలు
- పట్టించుకోని అధికారులు



చినసడుపూరు నుంచి వుడా కాలనీ వెళ్లే రోడ్డులో నిలిపిన స్కూల్ బస్సులు



గాంధీనగర్ వెళ్లే రోడ్డు సమీపంలో..

పెదగంట్యాడ: అంతా మా ఇష్టం.. అడిగేదెవరు.. అడ్డేదెవరు. రోడ్లపైనే వాహనాలు నిలిపి వేస్తాం.. అంటూ భారీ వాహనాల యజమానులు, డ్రైవర్లు ఇష్టారాజ్యంగా వ్యవరిస్తున్నారు.. అటు గాజువాక వెళ్లాలన్నా.. ఇటు పెదగంట్యాడ రావాలన్నా.. వుడా కాలనీకి వెళ్లాలన్నా.. గాంధీనగర్‌లోకి వెళ్లాలన్నా , పాఠశాలలు, కళాశాలలకు వెళ్లాలన్నా, ఆస్పత్రులు, విధులకు వెళ్లాలన్నా అన్నింటికీ ఒక్కటే ప్రధాన రహదారి.. అదే వుడా డబుల్ రోడ్డు.. అయితే ఈ రోడ్డు నిత్యం రద్దీగా ఉండడంతో ద్విచక్ర వాహనచోదకులు, పాద చారులు సర్వీస్‌రోడ్డులోనే ఎక్కువగా రాకపోకలు సాగిస్తుంటారు. ఉదయం వేళ విద్యార్థులు, పాఠశాలలకు, కళాశాలకు, ఉద్యోగులు విధులకు, అలాగే వివిధ పనులపై వెళ్తుంటారు. దీంతో ఈ రహదారి కూడా రద్దీగా ఉంటోంది. అయితే సర్వీస్ రోడ్డును కొంత మంది తమ పార్కింగ్ స్థలంగా వినియోగించుకుంటున్నారు. భారీ వాహనాలను అక్కడే నిలిపేస్తున్నారు. రోజుల తరబడి అక్కడే ఉంచేయడంతో ద్విచక్ర వాహనచోదకులు, పాదచారులు ఇక్కట్లు పడుతున్నారు. ప్రధానంగా లారీలు, స్కూల్ బస్సులు, టూరిస్టు బస్సులను అనధికారికంగా నిలిపివేయడంతో ట్రాఫిక్ సమస్యలు నెలకుంటున్నాయి. రాత్రి వేళ ఆ వాహనాలు కనిపించకపోవడంతో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ఎంతో మంది క్షతగాత్రులు అవుతున్నారు. అంతేకాకుండా విశాలంగా ఉండే రోడ్డు కాస్తా ఇరుగ్గా మారిపోతుంది. దీనిపై ట్రాఫిక్ పోలీసులకు ఫిర్యాదులు చేస్తున్నా పట్టించుకోవడం లేదని స్థానికులు, వాహనచోదకులు ఆరోపిస్తున్నారు. అక్కడ వాహనాలను నిలిపే వారిని ప్రశ్నిస్తే ఎదురుదాడికి దిగుతున్నారని చెబుతున్నారు. ఇప్పటికైనా ట్రాఫిక్ పోలీసులు స్పందించి అనధికారికంగా వాహనాలు నిలిపివేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. లేనిపక్షంలో ఆందోళన చేస్తామని హెచ్చరిస్తున్నారు.



వుడా డబుల్ రోడ్డు జీవీఎంసీ వాటర్ వర్క్స్ వద్ద..

చర్యలు తీసుకుంటాం..

సమస్య మా దృష్టికి వచ్చింది.. అక్కడ వాహనాలు నిలపవద్దని హెచ్చరించాం. మరోసారి ఆ రోడ్డుని పరిశీస్తాం. పార్కింగ్ చేస్తే జరిమానాలు విధిస్తాం.వాహనాలు అక్కడ నిలపకుండా చర్యలు తీసుకుంటాం.

– గణపతి, ఎస్‌ఐ
న్యూపోర్టు ట్రాఫిక్ పోలీస్ స్టేషన్

నూతన విభాగాధిపతికి సత్కారం



స్టీల్‌ప్లాంట్ సీఆర్‌ఎంపీ నూతన విభాగాధిపతి సిన్హాను సత్కరిస్తున్న నాయకులు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ సీఆర్‌ఎంపీ విభాగాధిపతిగా బాధ్యతలు స్వీకరించిన ఎం.కె. సిన్హాను సోమవారం కార్మిక నాయకులు కలిసి సత్కరించారు. వారు మాట్లాడుతూ నూతన మరిన్ని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో డీజీఎం కె. బ్రహ్మం, కార్మిక నాయకులు జెర్రిపోతుల ముత్యాలు, వి. రామ్‌కుమార్, పి. త్రివిక్రమ్ తదితరులు పాల్గొన్నారు.

మద్దాలకు సత్కారం



మద్దాల అప్పారావును సత్కరిస్తున్న గౌరీ సేవా సంఘం ప్రతినిధులు

పెదగంట్యాడ: పార్టీని క్షేత్ర స్థాయిలో బలోపేతం చేయడానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానని వైఎస్సార్ సీపీ 65వ వార్డు అధ్యక్షుడు మద్దాల అప్పారావు అన్నారు. వైఎస్సార్ సీపీ 65వ వార్డు అధ్యక్షునిగా నియమించడంతో సోమవారం గౌరీ సేవా సంఘం ప్రతినిధులు ఆడారి సూరిబాబు, పెంటకోట అప్పారావు, ఆడారి శంకర్‌తో పాటు పార్టీ నాయకులు పెద్ద సంఖ్యలో ఆయన్ను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో కొణతాల మల్లేశ్వరరావు, ఆడారి పరదేశినాయుడు, భీశెట్టి పార్థసారథి, గణేష్, రమణ తదితరులు పాల్గొన్నారు.

శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీకి ఘన నివాళి



ముఖర్జీ చిత్రపటంవద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

గాజువాక: భారతీయ జన సంఘ్ పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు శ్యామ్ ప్రసాద్ ముఖర్జీకి గాజువాక బీజేపీ నాయకులు నివాళులర్పించారు. పాతకర్ణవానిపాలెంలోని ఆ పార్టీ కార్యాలయంలో ఆ పార్టీ గాజువాక కన్వీనర్ కరణంరెడ్డి నర్సింగరావు మాట్లాడుతూ ముఖర్జీ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. దేశంలో రెండు జెండాలు, ఇద్దరు ప్రధానులు, రెండు రాజ్యాంగాలు ఉండకూడదనే సిద్ధాంతంతో పని చేశారన్నారు. ఆయన ఆశయలకనుగుణంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆర్టికల్ 370 రద్దు చేశారన్నారు. కార్యక్రమంలో నాయకులు సిరసపల్లి అప్పారావు, కరణం దేముడు, ఆదిలక్ష్మి, నీరజ, లక్ష్మి, తెప్పల రవి, గంతకోరు నారాయణ, రామునాయుడు, సోనీ శర్మ తదితరులు పాల్గొన్నారు.

పెదగంట్యాడ: శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ సేవలు మరువలేమని బీజేపీ ఉక్కునగరం మండల అధ్యక్షుడు సంతోష్ సింగ్ అన్నారు. జీవీఎంసీ 76వ వార్డు పరిధిలోని బాలచెరువులో శ్యాం ప్రసాద్ ముఖర్జీ చిత్రపటానికి 76వ వార్డు అధ్యక్షుడు జీలకర్ర రమణ, కన్వీనర్ జీలకర్ర భువనేశ్వరి, తులసీదాస్ తదితరులు నివాళులర్పించారు.

ఇస్లాంపేట హైస్కూల్‌కు సౌండ్ సిస్టం వితరణ



మైక్‌సెట్, ఎలక్ట్రానిక్ స్కూల్ బెల్ అందిస్తున్న దాతలు

పెదగంట్యాడ: క్రమశిక్షణతో చదివే విద్యార్థులకు ఉన్నత భవిష్యత్ ఉంటుందని వినియోగదారుల హక్కుల పరిరక్షణ వేదిక కన్వీనర్ పట్టా రామ అప్పారావు, సర్వహిత చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకుడు గుదే సుశీలా గజేంద్రరావు అన్నారు. ప్రజా సంఘాల నేతలు, దాతలు పట్టా రామ అప్పారావు, గుదే సుశీలా గజేంద్రరావు, బలిరెడ్డి నాగేశ్వరరావు, విందుల వంశీ శ్రీనివాస్, నిమ్మకూరి రమేష్‌లు రూ.30 వేల విలువైన సౌండ్ సిస్టమ్ (మైక్‌సెట్) ఎలక్ట్రానిక్ స్కూల్ బెల్‌ను మండలంలోని ఇస్లాంపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం జి.ప్రమీలకు అందించారు. ఉక్కు మాజీ అధికారులు జామి గణేష్, మారా మాస్తాన్‌రెడ్డి మాట్లాడుతూ చదువు వ్యక్తి, కుటుంబాల జీవన గమనాన్ని మార్చుతుందన్నారు. కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు నిమ్మకూరి రమేష్, సీనియర్ ఉపాధ్యాయులు ఆనంద్, ఫిజికల్‌డైరెక్టర్లు బి.అన్నాజీరావు, నిజాముద్దీన్, ఇతర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సేవలోనే సంతృప్తి



రామఅప్పారావును సత్కరిస్తున్న ప్రజాసంఘాల నాయకులు

అగనంపూడి: మనిషి ఎంత ఎత్తు ఎదిగినా దక్కని గౌరవం, ఆనందం సమాజ సేవలో మాత్రమే దొరుకుతుందని సమాచార హక్కు చట్టం కార్యకర్త పట్టా రామ అప్పారావు అన్నారు. అగనంపూడికి చెందిన ప్రజా సంఘాల నాయకులు సోమవారం రామ అప్పారావును ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స.హ.చట్టంపై ప్రజల్లో అవగాహన కల్పించడం, తద్వారా సమాజానికి ఉపయోగపడేలా చేయడమే తన లక్ష్యమన్నారు. మాజీ సైనికోద్యోగుల సంఘ నాయకులు మేడిశె శెట్టి ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ అన్నార్తులను ఆదుకోవడం, పేదలకు అండగా నిలవడంలో అప్పారావు పలువురికి ఆదర్శనీయమన్నారు. కార్యక్రమంలో నాయకులు విందుల పాపారావు, పాముల వసంత్, ఎం.రామకృష్ణ, బొండా సురేష్, బలిరెడ్డి అప్పలరాజు, బొండా కృష్ణ మోహన్ తదతరులు పాల్గొన్నారు.

కులం పేరుతో దూషించిన వారిపై చర్యలకు డిమాండ్



కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న నాయకులు

మహారాణిపేట: కులం పేరుతో తిట్టి అవమానించిన వారిపై చర్యలు తీసుకోవాలని కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు వై.రాజు డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన ప్రదర్శన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తిరిగి విధుల్లోకి తీసుకోవాలని, లేని పక్షంలో సినిమా థియేటర్ ఎదుట ఆందోళన చేస్తామన్నారు. ఇప్పటికే ఎల్‌ఐసీ బిల్డింగ్ వద్ద గల అంబేడ్కర్ విగ్రహం ఎదుట నిరసన కార్యక్రమం నిర్వహించామన్నారు. సంఘం జిల్లా నాయకులు ఎం.సుబ్బారావు, కె.చంద్రశేఖర్ ఆధ్వర్యంలో పలువురు నాయకులు పాల్గొన్నారు. అనంతరం కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు.

ఎస్సీ ప్రొఫెసర్‌పై కుల వివక్షను ఖండించాలి



సమావేశంలో పాల్గొన్న నాయకులు

మహారాణిపేట: తిరుపతి శ్రీ వెంకటేశ్వర వెటర్నరీ యూనివర్సిటీ డెయిరీ టెక్నాలజీ కళాశాలలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పని చేస్తున్న షెడ్యూల్ కులానికి చెందిన వి. రవివర్మను ఆ కళాశాలలో అసోసియేట్ డీన్‌గా పని చేస్తున్న రవింద్రారెడ్డి కుల వివక్షతో ఇబ్బంది పెడుతున్నారని, ఈ విషయాన్ని భీమ్ సేన వార్ తీవ్రంగా ఖండిస్తుందన్నారు. సోమవారం కంచరపాలెంలో ఉన్న భీమ్ సేన వార్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ప్రెసిడెంట్ కొరమాటి చిన్నారావు, జనరల్ సెక్రటరీ డాక్టర్ వసంత రాజేంద్రప్రసాద్ తదితరులు పాల్గొని ప్రసంగించారు. కాలేజీలో అతని ఛాంబర్‌లో వేసిన టేబుల్, కుర్చీలు తొలగించి, కంప్యూటర్స్, ఫైల్స్‌ను ఇష్టం వచ్చినట్టు పడవేయించారన్నారు. ఇలాంటి చర్యలకు పాల్పడిన అసోసియేట్ డీన్ రవీంద్రరెడ్డిని వెంటనే సస్పెండ్ చేసి అతనిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని రాజేంద్ర ప్రసాద్ కోరారు. ఈ సమావేశంలో వైస్ ప్రెసిడెంట్ వి.వి. దుర్గారావు, జాయింట్ సెక్రటరీలు కొల్లబత్తుల ప్రసాదరావు, నామాల రేణు కుమార్, ట్రెజరర్ బల్లంకి కనకరాజు, ఎగ్జిక్యూటివ్ మెంబర్లు కృష్ణకుమారి, ఎం. చంద్రశేఖర్, ఐజక్ తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ మనందరి బాధ్యత



పెయింటింగ్ పోటీల విజేతలకు బహుమతులు అందజేస్తున్న అతిథులు, నిర్వాహకులు

ఉక్కునగరం: పర్యావరణ పరిరక్షణ మనందరి బాధ్యత అని ఇందు కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని స్టీల్‌ప్లాంట్ హెచ్‌ఆర్ విభాగాధిపతి ఎం. మధుసూదనరావు అన్నారు. అర్థిగా ఫౌండేషన్, గ్రీన్ ట్రీస్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సోమవారం ఉక్కు డీఏవీ పాఠశాలలో పెయింటింగ్ పోటీలు నిర్వహించారు. 15 పాఠశాలలకు చెందిన 300 మంది విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. అదే విధంగా ఆన్‌లైన్‌లో రాష్ట్రంలోని 84 పాఠశాలల నుంచి 450 మంది విద్యార్థులు హాజరయ్యారు. కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన ఆర్ట్ ఎగ్జిబిషన్ ఆహుతులను ఆకట్టుకుంది. అనంతరం విజేతలకు మధుసూదనరావు, పాఠశాల హెచ్‌ఎం సుగంధ కుమారి, గ్రీన్ ట్రీస్ ట్రస్ట్ చైర్మన్ దొడ్డి సన్నిబాబు, అర్థిగా ఫౌండేషన్ వ్యవస్థాపకులు హరి గణేష్ చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. అంతకు ముందు పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా గుడ్డ సంచులు పంపిణీ చేశారు.

ఘనంగా అమ్మవారి తొలేళ్లు



అమ్మవారిని ఊరేగిస్తున్న నిర్వాహకులు

కూర్మన్నపాలెం: రథాలమ్మతల్లి పండగను పురస్కరించుకొని వడ్లపూడి కణితి కాలనీలో సోమవారం తొలేళ్ల ఉత్సవం ఘనంగా నిర్వహించారు. మేళతాళాలతో అమ్మవారిని ఊరేగించి భక్తి శ్రద్ధలతో పూజలు చేశారు. రామాలయం నుంచి అమ్మవారి ఘటాలను వడ్లపూడి పురవీధుల్లో ఊరేగించారు. ఉత్సవం ముందురోజు కావడంతో తెల్లవార్లు ఘటాలు మోసిన భక్తులు ఉపవాసాలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. కాగా అమ్మవారి సిరిమాను ఉత్సవం మంగళవారం అత్యంత వైభవంగా నిర్వహించనున్నారు. కణితి రామాలయం వద్ద సిరిమాను ప్రారంభమై మెయిన్‌రోడ్డు , చాకలివీధి మీదుగా రథాలమ్మ ఆలయానికి చేరుకుంటుందని నిర్వాహకులు తెలిపారు.

మత్తుకు బానిస కావద్దు



గోడ పత్రిక ఆవిష్కరిస్తున్న నాసిన్ డైరెక్టర్ రవికిరణ్ తదితరులు

సీతంపేట: అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినం సందర్భంగా 'మత్తు వద్దు , బంగారు భవిష్యత్తే ముద్దు'అనే నినాదంతో బాలవికాస్ ఫౌండేషన్ రూపొందించిన గోడపత్రికను అక్కయ్యపాలెంలోని నేషనల్ అకాడమీ ఆఫ్ కస్టమ్స్ ఇన్ డైరెక్ట్ టాక్సెస్ అండ్ నార్కోటిక్స్ (నాసిన్) కార్యాలయంలో సంస్థ డైరెక్టర్ ఈదర రవికిరణ్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువతరం మత్తుకు బానిస కావొద్దంటూ బాలవికాస్ ఫౌండేషన్ విస్తృత ప్రచారం చేయడం అభినందనీయమన్నారు. పిల్లల ప్రవర్తనను తల్లిదండ్రులు నిత్యం గమనించాలని, వాళ్లకు అభిరుచి ఉన్న రంగంలో ప్రోత్సహించాలని సూచించారు. బాలవికాస్ వ్యవస్థాపక కార్యదర్శి నరవ ప్రకాశరావు మాట్లాడుతూ ఈనెల 26న కళాశాలల్లో మాదకద్రవ్యాలపై యువతకు అవగాహన సదస్సులు నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జీఎస్టీ అండ్ కస్టమ్స్ అదనపు కమిషనర్ కాకరాల ప్రశాంత్, నాసిన్ సహాయ డైరెక్టర్ కె.ఆర్.ఎస్.శంకర్ తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛతలో పారిశ్రామిక వేత్తలు భాగస్వాములు కావాలి



పరిసరాలను పరిశుభ్రం చేస్తున్న పారిశ్రామిక వేత్తలు, ఎంఎస్ఎంఈ అధికారులు

గాజువాక: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడం పారిశ్రామికవేత్తలు అలవాటుగా మార్చుకోవాలని ఎంఎస్ఎంఈ అసిస్టెంట్ డైరెక్టర్ ప్రభాకర్ అన్నారు. ఎంఎస్ఎంఈ, ఐలా, వాసివా ఆధ్వర్యంలో గాజువాక ఆటోనగర్ ఈ బ్లాక్‌లో సోమవారం స్వచ్ఛభారత్ కార్యక్రమం నిర్వహించారు. చీపుళ్లు పట్టి బ్లాక్‌లోని పరిసరాలను శుభ్రం చేశారు. పలుచోట్ల మొక్కలను నాటారు. కార్యక్రమాన్ని ప్రారంభించిన ప్రభాకర్ మాట్లాడుతూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడానికి అందరూ సహకరించాలని కోరారు. స్వచ్ఛభారత్ పాటిస్తామని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుతామని పారిశ్రామికవేత్తలు ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో ఐలా కార్యదర్శి చీకటి సత్యనారాయణ, ఎంఎస్ఎంఈ డైరెక్టర్ చంద్రమౌళి, ప్రతినిధులు శ్రీనివాసులు, పాండురంగ ప్రసాద్, కొల్లి ఈశ్వరరావు, ఎ.కె.బాలాజీ, రాంప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

వాసీ కార్యవర్గానికి సత్కారం

కాగా, నూతనంగా ఎన్నికైన వాసి కార్యవర్గాన్ని, ఎంఎస్ఎంఈ అధికారులను హిందూస్తాన్ కెమికల్స్ యజమాని మూర్తి, విశాలాక్షి దంపతులు ఘనంగా సత్కరించారు. వాసీ కార్యవర్గం విస్తృతమైన అభివృద్ధి కార్యక్రమాలను నిర్వహించాలని ఈ సందర్భంగా వారు ఆకాంక్షించారు.

విమల విద్యాలయం ప్రారంభానికి అంగీకారం



సమావేశంలో పాల్గొన్న ఉక్కు ఉన్నతాధికారులు, కార్పొరేటర్, దయాసిస్ ప్రతినిధులు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్‌లోని విశాఖ విమల విద్యాలయం కొనసాగించటానికి ఉక్కు యాజమాన్యం అంగీకరించింది. కార్పొరేటర్ బి. గంగారావు అందజేసిన వివరాల మేరకు.. ఉక్కు హెచ్‌ఆర్ విభాగం ఉన్నతాధికారులతో సోమవారం కార్పొరేటర్ బి. గంగారావు, దయాసిస్ సంస్థ ప్రతినిధులు, విద్యార్థుల తల్లిదండ్రుల మధ్య చర్చలు జరిగాయి. హైకోర్టులో వచ్చే తీర్పుకు లోబడి దయాసిస్ సంస్థతో ఒప్పందం కొనసాగిస్తామని యాజమాన్యం తెలిపింది. పాఠశాలకు అవసరమైన అనుమతుల కోసం జిల్లా విద్యాశాఖాధికారిని కోరనున్నామన్నారు. ఇందుకు సంబంధించిన మినిట్స్‌పై సంతకాలు చేశారు. చర్చల్లో ఉక్కు హెచ్‌ఆర్ విభాగాధిపతి ఎం. మధుసూదనరావు, దయాసిస్ సంస్థ కరస్పాండెంట్ ఫాదర్ థామస్ పులికెల, ఫాదర్ రత్నకుమార్, ఫాదర్ ప్రతాప్, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ట్రిపుల్ ఐటీకి నలుగురు నడుపూరు పాఠశాల విద్యార్థులు



బందారు హేమంత్‌కుమార్



రాజేటి సెల్విన్



ఇమంది పవన్‌కుమార్



పలపాల జౌషిక

పెదగంట్యాడ: మండలంలోని నడుపూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు బండారు హేమంత్‌కుమార్, రాజేటి సెల్విన్ జస్వంత్, ఇమంది పవన్‌కుమార్, పలపాల జౌషిక ట్రిపుల్ ఐటీకి ఎంపికయ్యారని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రాచకొండ శ్రీనివాస్ తెలిపారు. హేమంత్, సెల్విన్ నూజివీడు క్యాంపస్, పవన్‌కుమార్ ఒంగోలు క్యాంపస్, జౌషిక శ్రీకాకుళం క్యాంపస్‌లకు ఎంపికయ్యారని ఆయన తెలిపారు. పాఠశాలకు చెందిన నలుగురు విద్యార్థులు ఒకే సారి ఎంపిక కావడం మండలంలోనే ఇదే మొదటిసారి అని తెలిపారు. ఈ మేరకు విద్యార్థులను సిబ్బందితో పాటు పాఠశాల కమిటీ సభ్యులు అభినందించారు.